నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, బుధవారం 12 జూన్ 2024 | MEDAK

కోనాపూర్ ఆదర్శ పాఠశాలలో పనుల వివరాలు తెలుసుకుంటున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సదాశివపేట, జూన్ 11: పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోనాపూర్, పట్టణంలోని పీఎస్ఎంఎల్ కాలనీలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలకు పంపిస్తే స్కూల్ ఫీజులతోపాటు బస్సు చార్జీలతో ఆర్థిక భారం ఏర్పడుతుందని చెప్పారు. పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను ఉచితంగా అందజేస్తుందని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవిధంగా మోటివేషన్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జక్కపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

బడీడు పిల్లలను బడికి రప్పించాలి

బడిబాటలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, జూన్ 11: బడీడు పిల్లలను బడికి రప్పించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని జక్కపల్లి గ్రామంలో, తండాల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని గడపగడపకెళ్లి పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను బడికి కచ్చితంగా పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎవరైన పిల్లలు పదోతరగతి, ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేస్తే వారితో మాట్లాడి వారికి సరైన కళాశాలలో అడ్మిషన్స్ ఇచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జక్కపల్లిలోని మోడల్ స్కూల్‌లో సోమవారం రాత్రి పల్లెనిద్రలో భాగంగా బస చేసిన కలెక్టర్ మంగళవారం ఉదయం గ్రామంలోని 100శాతం ఇండ్లను సందర్శించి బడీడు పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మండల విద్యాధికారి బుచ్చానాయక్, ఎంపీడీవో మధులత, తహసీల్దార్ కమలాద్రి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌వెంకటలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం గౌరీశంకర్, సీఆర్పీ భైరవ్‌రెడ్డి ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భర్త కోసం భార్య ఆందోళన

మర్మాములలో భర్త జాడ చెప్పాలని లారీ ఓనర్ ఇంటి ఎదుట బైఠాయించిన శ్రీకాంత్ భార్యాపిల్లలు

- లారీ పని కోసమని తీసుకెళ్లి మాయం చేశారు...
- లారీ ఓనర్ ఇంటి ఎదుట బైఠాయింపు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 11: లారీ పని కోసమని తన భర్తను తీసుకెళ్లి మాయం చేశారని ఆరోపిస్తూ ఓ మహిళా పిల్లలు, బంధువులతో కలసి లారీ ఓనర్ ఇంటి ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగిన ఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని మర్మాములలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..మర్మాముల గ్రామానికి చెందిన లారీ ఓనర్ బత్తిని కనకయ్య మే 3న గ్రామంలోని యాటెల్లి శ్రీకాంత్‌ను లారీ డ్రైవర్ నూకల పూర్ణచందర్‌రెడ్డితోపాటు తమిళనాడు నాంకల్ జంక్షన్‌లో లారీ లోడ్ దించిరావాలని పంపించాడు. అయితే మే 7న గ్రామానికి పూర్ణచందర్‌రెడ్డి ఒక్కడే తిరిగి వచ్చాడు. ఈనెల 8వ తేదీన యాటెల్లి శ్రీకాంత్ భార్య కవిత పూర్ణచందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి నీతో కలిసి వెళ్లిన భర్త ఎక్కడున్నాడని ప్రశ్నించింది. దీంతో నీ భర్త నా వద్ద రూ.200 తీసుకొని ఎక్కడికో వెళ్లాడని పూర్ణచందర్‌రెడ్డి చెప్పాడు. ఆందోళనకు గురైన కవిత తన బంధువులతో కలిసి తమిళనాడుకు వెళ్లి అక్కడ పలు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు శ్రీకాంత్ మిస్సింగ్ అయినట్లు పోస్టర్లు అంటించారు. తమిళనాడు అంత వెదికినా భర్త ఆచూకీ దొరకకపోవడంతో ఆమె తిరిగి గ్రామానికి చేరుకొని మే 15న మద్దూరు పోలీస్‌లకు భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. అయితే ఇక్కడి పోలీసులు తొలుత ఫిర్యాదు తీసుకోకపోగా, మా పరిధిలోకి రాదని దాటవేశారని రెండ్రోజుల తర్వాత కేసు నమోదు చేశారని శ్రీకాంత్ భార్య కవిత వాపోయింది. అయినప్పటికి శ్రీకాంత్ జాడ తెలువకపోవడంతో మంగళవారం కవిత తన ఇద్దరు కొడుకులు, బంధువులతో కలిసి మర్మాములలో లారీ ఓనర్ బత్తిని కనకయ్య ఇంటి ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగింది. తన భర్త జాడ తెలిపే వరకు తన ఆందోళనను విరమించేది లేదని ఆమె భీష్మించి కూర్చుం ది. భర్త ఆచూకీ తెల్పకపోతే ఇక్కడ తన పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని కవిత హెచ్చరించింది. ఈ క్రమంలో లారీ ఓనర్ కనకయ్య శ్రీకాం త్ భార్య కవిత, బంధువుల మధ్య కొంత ఘర్షణ చోటుచేసుకోగా పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చ చెప్పి వారిని చేర్యాల సీఐ శ్రీను వద్దకు తీసుకెళ్లారు.

టీబీ నివారణకు శిబిరాలు నిర్వహించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 11: సంగారెడ్డి జిల్లాలో టీబీ నిర్ధారణ కోసం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా టీబీ కంట్రోల్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైడెన్సిటీ ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో రెగ్యులర్‌గా టీబీ స్క్రీనింగ్ మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఏ ఒక్క టీబీ కేసు మిస్ కాకుండా గుర్తించాలన్నారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల సమావేశంలో టీబీపై అవగాహన కల్పించాలన్నారు. ఆశ వర్కర్ల ద్వారా టీబీ రోగులకు ఇబ్బంది లేకుండా మం దులు ఇంటి వద్దకే అందించాలని సూచించారు. ఎన్‌జీవో సంస్థలు రెగ్యులర్‌గా ఎక్స్‌రే శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ప్రైవేటు హాస్పిటల్ నుంచి టీనీ అనుమానితుల శాంపిల్స్ టెస్టింగ్, డీఎంసీలకు పంపించాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి, డీటీసీవో డాక్టర్ రాజేశ్వరి, డీఐవో డాక్టర్ శశాంక్ దేశ్‌పాండే, మెడికల్ కళాశాల దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, వివిధ విభాగాల వైద్యాధికారులు డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ చక్రపాణి, జడ్పీ సీఈవో జానకీ రెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువత నాణ్యమైన సేవలు అందించాలి

- గవర్నర్, వర్సిటీ చాన్స్‌లర్ రాధాకృష్ణన్
- ఘనంగా కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం 3వ స్నాతకోత్సవం
- విద్యార్థులకు పతకాలు అందజేత


స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ రాధాకృష్ణన్, పక్కన వీసీ నీరజాప్రభాకర్, తమిళనాడు అగ్రికల్చర్ వీసీ గీతాలక్ష్మి, వర్సిటీ అధికారులు

ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులతో గవర్నర్ రాధాకృష్ణన్, వర్సిటీ అధికారులు, అతిథులు

ములుగు, జూన్ 11: యువత విధి నిర్వహణలో నాణ్యమైన సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతోపాటు పనిలో నాణ్యతను చూపితే విజయం మీ దాసోహం అవుతుందని రాష్ట్ర గవర్నర్, ఉద్యాన వర్సిటీ చాన్స్‌లర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగా ణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం 3వ స్నాతకోత్సవాన్ని ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. స్నాతకోత్సవంలో భాగంగా 156 అండర్ గ్రాడ్యువేషన్, 45 పోస్ట్ గ్రాడ్యువేషన్, 6 పీహెచ్‌డీ విద్యార్థులలతోపాటు వర్సిటీ అనుబంధ కళాశాల అయిన అటవీ కళాశాలకు చెందిన 50 అండర్ గ్రాడ్యువేషన్ 30 పోస్ట్ గ్రాడ్యువేషన్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు.కార్యక్రమానికి గవర్నర్ రాధాకృష్ణన్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా వీసీ డాక్టర్ నీరజాప్రభాకర్, వర్సిటీ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. మొదట వాయిద్యాలతో జాతీయ గీతాన్ని ఆలపించిన అనంతరం సభా వేదికపై గవర్నర్ రాధాకృష్ణన్ ప్రసంగించారు. విద్యార్థులు విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని, కష్టాలు ఎదురైతే విరామం తీసుకోవచ్చు కానీ, లక్ష్యం సాధించేవరకు వెనుతిరుగొద్దని విద్యార్థులకు సూచించారు. ఉజ్వల భవిష్యత్తు కోసం గొప్ప లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తికి ఎదిగేందుకు భారత్‌కు పుష్కల అవకాశాలు ఉన్నాయని అందుకు యువత ప్రముఖ పాత్ర పోషించాలని అన్నారు. భారత జాతీయ స్థూల జాయోత్పత్తికి 18శాతానికి మించి వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకు ప్రభుత్వం సహజ, సేంద్రియ వ్యవసాయానికి మరింత మద్దతునిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగంతోపాటు ఉద్యాన, అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమేనని పేర్కొన్నారు. తరుగుతున్న సాగు నేల, సహజ వనరులు, పంటల ఉత్పాదకత, పర్యావరణ మార్పుల నేపథ్యంలో సుస్థిర భద్రత సాధించడంతోపాటు సూపర్ ఎకానమిక్ పవర్‌గా భారత్ ఎదిగేందుకు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థులకు పతకాలు ప్రదానం

స్నాతకోత్సవంలో భాగంగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసిన అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గవర్నర్ రాధాకృష్ణన్ చేతుల మీదుగా బంగారు పతకాలను అందజేశారు. బీఎస్సీ హానర్స్ హార్టికల్చర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందకు 2023 బ్యాచ్‌కు చెందిన వరలక్ష్మి మూడు బంగారు పతకాలు అందుకున్నారు. బీఎస్సీ హానర్స్ ఫారెస్ట్రీలో పీసీసీ ఎఫ్ గోల్డ్ మెడల్‌ను రవళి, డీన్స్ గోల్డ్ మెడల్ ప్రత్యూష అందుకున్నారు. ఎమ్మెస్సీ హార్టికల్చర్‌లో అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు మాళవిక మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. వీరితోపాటు పండ్లశాస్త్ర విభాగంలో విద్యశ్రీ, ఔషధ, సుగంధ ద్రవ్య విభాగంలో మహేశ్వరి బంగారు పతకాలను అందుకున్నారు. కార్యక్రమంలో తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ గీతాలక్ష్మి, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, రిజిస్ట్రార్ భగవాన్, డీన్ రాజశేఖర్, పరిశోధన సంచాలకులు కిరణ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీనివాసన్, ఉద్యానశాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి, బోర్డుమెంబర్ ఆర్కే మాథూర్, వర్సిటీ అధికారులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం దిశగా కార్యాచరణ

వీసీ నీరజాప్రభాకర్

ఉద్యాన మానవ వనరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ అందించడతోపాటు క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక సహకారాన్ని అందించి వెన్నుదన్నుగా నిలిచేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించి వాటిని అమలుపరుస్తున్నామని ఉద్యాన వర్సిటీ వీసీ నీరజాప్రభాకర్ అన్నారు. స్నాతకోత్సవంలో ఆమె మాట్లాడుతూ...తెలంగాణలో రైతులు సాగు చేస్తున్న బాలనగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపుతోపాటు మరికొన్ని స్థానిక పంటలకు భౌగోళిక గుర్తింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. రైతులకు శాస్త్రీయతతో కూడిన ఉద్యాన దర్శినితో ప్రచురణతోపాటు గ్రామాల దత్తత, విస్తరణ కార్యక్రమాల ద్వారా రైతులకు ఉద్యాన పరిజ్ఞానాన్నిఅందజేస్తున్నట్లు తెలిపారు.

శిక్షణలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి, హాజరైన పోలీసులు, సిబ్బంది

నూతన చట్టాలపై పోలీసులకు శిక్షణ

మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్ అర్బన్, జూన్ 11: దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి నూతన చట్టాలను అమలుచేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకనుణంగా నూతన చట్టాలపై పోలీసులకు మెదక్ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కాలానుగుణంగా ఐపీసీ, సీఆర్పీసీ, ఐఈఏ చట్టాలను సవరణ చేయగా కొన్నింటిని నూతనంగా చేర్చారని పేర్కొన్నారు. ఈ చట్టాలపై జిల్లాలో కొంతమంది అధికారులకు శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణ పొందిన అధికారులు విడతల వారీగా నిర్వహించే శిక్షణలో అవగాహన కల్పిస్తారని చెప్పారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యాధినియంపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారని ఎస్పీ చెప్పారు. కొత్త చట్టాలపై అవగాహన రావాలంటే నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే సాధ్యమవుతుందని, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్‌కు ఎవరు అర్హులు, చార్జిషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో అధికారులు ఎలా వ్యవహరించాలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ రాజేశ్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

మూడు దశాబ్దాల స్నేహబంధం

లచ్చపేట ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దుబ్బాక, జూన్11: విద్యార్థి దశ ప్రతిఒక్కరి జీవితంలో ఎన్నో మధుర స్మృతులను గుర్తు చేస్తుంది. ఆనాటి విద్యార్థి దశను గుర్తు చేసుకుంటూ..మిత్రులను కలుసుకోవడానికి పదోతరగతి బ్యాచ్‌కు మూడు దశాబ్దాలు(30ఏండ్లు) పట్టింది. వాట్సాప్ వేదికగా స్నేహితులను కలుపుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో చదవుకున్న పాఠశాలకు ఓ సైన్యంలా కదలివచ్చారు. వచ్చిన మిత్రులు పాఠశాల పరిసరాలలో తిరుగుతూ, తమకు బోధించిన గురువులను గౌరవంగా ఆహ్వానించి, ఘనంగా సత్కరించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట ప్రభుత్వ పాఠశాల అంటే విద్యావిజ్ఞానం, క్రీడలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంది. పదోతరగతిలో రాష్ట్రస్థాయి ర్యాంకులు వచ్చాయి. క్రీడలు, యోగా, విజ్ఞాన పోటీల్లో సైతం రాష్ట్ర, జాతీయ స్థాయిలో పథకాలు సాధించారు. ఈ పాఠశాలలో 1993-94 బ్యాచ్‌లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు కుటుంబాలతో కలిసి మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థి దశలో చేసిన మంచి పనులతోపాటు కొంటే పనులను సభా వేదిక ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం చాలామంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిర పడ్డారు. కొందరు ప్రభుత్వ వైద్యులుగా ..ఉపాధ్యాయులుగా ఉన్నారు. మరికొందరు వ్యాపారంలో, వ్యవసాయంలో రాణిస్తున్నారు. గురువులైన తొగుట ఎంఈవో యాదవరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, జగదయ్య, నర్సింహారెడ్డిలకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. లచ్చపేట గ్రామానికి చెందిన పోలాస నర్సయ్య అనే హరిత విప్లవకారున్ని ఘనంగా సన్మానించి, నగదు అందజేశారు. కార్యక్రమానికి కృషి చేసిన తాళ్ల నవీన్, నందాల శంకర్, బచ్చు దీపక్, రాజేశం, సతీశ్, నరేందర్, మోహన్,బాలరాజు, అలివేణి మంగ, పద్మ, మంజుల, శ్యామలను ప్రత్యేకంగా అభినందించారు.

లచ్చపేట ప్రభుత్వ పాఠశాలలో 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాలల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల మైసయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇప్పించాలి

నర్సాపూర్, జూన్ 11: నర్సాపూర్‌లో ప్రజా యుద్ధనౌక, ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాన్ని, మండలపరిధిలోని కాగజ్‌మద్దూర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి మంగళవారం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మాలల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల మైసయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలపరిధిలోని కాగజ్‌మద్దూర్‌లోని బస్టాండ్ పక్కన డా.బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, మెదక్ జిల్లా కేంద్రంలో, నర్సాపూర్‌లో గద్దర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న ఎస్సీ,ఎస్టీలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని కోరారు. నర్సాపూర్ పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా రోడ్డు విస్తరమ కోసం మహనీయుల విగ్రహాలను తొలిగించారని, ఆ విగ్రహాలను యథావిధిగా పునరుద్ధరించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాలల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల మైసయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ ఉద్యోగులకు బదిలీల గుబులు

- ఉద్యోగుల వారీగా వివరాలు సేకరించిన దేవాదాయ శాఖ అధికారులు
- ఈనెల 14 తర్వాత బదిలీ అయ్యే అవకాశం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆలయం

చేర్యాల, జూన్ 11: కాంగ్రెస్ సర్కారు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందిని బదిలీలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తుండడంతో కొమురవెల్లి మల్లన్న ఆలయంలో విధులు నిర్వహించే ఉద్యోగుల్లో బదిలీల గుబులు మొదలైంది. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలైన యాదాద్రి, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం, బాసర జ్ఞాన సరస్వతి ఆలయం, కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆలయం, భద్రాచలం సీతారామ స్వామి వారి ఆలయం, సికింద్రాబాద్ గణేశ్ టెంపుల్ తదితర ఆలయాలకు చెందిన అధికారులు, సిబ్బందిని బదిలీ చేసేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో ఇటీవల మంత్రి కొండా సురేఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో నిర్ణయించారు. దీంతో కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆలయానికి చెందిన ఉద్యోగులకు బదిలీలు తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా ఒకేచోట పనిచేయడంతో అవినీతి, అక్రమాల ఆరోపణలను కొందరు ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆలయాల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేస్తే అవినీతి, అక్రమాలను రూపుమాపవచ్చని సర్కారు బదిలీల ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 13 ఏండ్ల క్రితం ఉమ్మడి ఏపీ పాలనలో ఉన్న సమయంలో కొమురవెల్లి ఆలయం నుంచి యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, భద్రాచలం, బాసర తదితర ఆలయాలకు ఉద్యోగులు బదిలీపై వెళ్లారు. అక్కడ విధులు నిర్వహించిన ఉద్యోగులు ఇక్కడికి వచ్చారు.13 ఏండ్ల క్రితం జరిగిన బదిలీలు తప్ప మరోసారి ట్రాన్స్‌ఫర్లు లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు ప్రధానంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

29 ఏండ్లుగా ఇక్కడే ఉద్యోగం..

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఉద్యోగంలో జాయిన్ అయినప్పటి నుంచి నేటివరకు కొందరు ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో 18 మంది ఉద్యోగులు, సిబ్బంది పని చేస్తున్నారు. ఇందులో 29 ఏండ్ల నుంచి మొదలు కుని 25, 23, 21,11 సంవత్సరాలు కొందరు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఏఈవోలు, జూనియర్, రికార్డు అసిస్టెంట్లతోపాటు సిబ్బంది బదిలీలు తప్పవని స్థానికంగా చర్చ జరుగుతున్నది.

దేవాదాయ శాఖ కార్యాలయానికి జాబితా..

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఏండ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల జాబితాతోపాటు ఆలయంలో పనిచేస్తున్న పూర్తి స్థాయి ఉద్యోగులు, సిబ్బంది జాబితాను దేవాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయానికి ఇటీవల చేరినట్లు విశ్వసనీయ సమాచారం. జాబితా వెళ్లిన విషయం తెలుసుకున్న పలువురు ఉద్యోగులు, సిబ్బంది జాబితాలో తన పేరు ఉందా, ఉంటే ఏ ఆలయానికి ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లాల్సి వస్తుందోనని గుబులులో ఉన్నారు. ఇక్కడే ఉద్యోగ విరమణ జరిగితే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటితో నిర్మించారు..ప్రారంభం మరిచారు

- కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ప్రారంభం ఎప్పుడో..?

ప్రారంభానికి నోచుకోని సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ భవనం

కొమురవెల్లి, జూన్ 11: ఆధునిక పోలీస్‌సేష్టన్‌ను నిర్మించేందుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.కోటి నిధులు వెచ్చించింది. ప్రారంభించే సమాయానికి ఎన్నికల కోడ్ వచ్చింది. నాటి నుంచి పోలీస్ స్టేషన్‌ను అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలో పోలీస్‌స్టేషన్ పరిస్థితి.... బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం నూతన మండలాలను ఏర్పాటు చేశారు. దానిలోభాగంగా కొమురవెల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేయడంతోపాటు శాంతి భద్రతలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ వెళ్లే దారిలో నూతనంగా పోలీస్‌స్టేషన్ నిర్మించుటకు స్థలం కేటాయించి ఆధునాతన పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేసి నిర్మించారు.

ఆధునాతన పోలీస్ స్టేషన్...

రూ.కోటి నిధులతో కొమురవెల్లిలో ఆధునాతన పోలీస్‌స్టేషన్‌ను నిర్మించారు. నాటి ఎస్సై చంద్రమోహన్ యాదవ్ పలువురు దాతల సాయంతో పోలీస్‌స్టేషన్ చుట్టూ అందమైన మొక్కలను నాటించమే గాక, స్టేషన్‌కు వచ్చే వారికి సౌలభ్యంగా ఉండేవిధంగా పోలీస్ స్టేషన్ తీర్చిదిద్దాడు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పాటు ఎస్సై చంద్రమోహన్ సైతం బదిలీకావడంతో పోలీస్ స్టేషన్ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రభుత్వం మారడంతో నాటి నుంచి నూతన భవనం మరుగున పడింది.

అదే కారణమా..?

నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేసన్ సమీపంలోనే వైన్‌షాప్ ఉంది. గతేడాది ఎన్నికల కోడ్‌కు ముందు కొమురవెల్లికి చెందిన గీస కిష్టయ్య అనే వ్యక్తి సమీపంలోని వైన్ షాప్‌లో మద్యం తాగి అప్పట